శిక్షావల్లి

ఆ మనిషిని చూపించాడు—డాక్టరు: "ఏమిటో యితడిలో లోపం చెప్పుకో చూదాము. జబ్బుగా వున్నాడంటావా? - సరి. అందుకోసం నీ తెలివితేటలు ఏమీ వినియోగించ నక్కరలేదు: జీనస్ అన్నట్టు జబ్బుగా వున్నవాడే వైద్యు డెక్కడా అని వెదుక్కుంటూ వస్తాడు. ఎవడో, నీవంటి వజ్రకాయుడు తప్ప. నీవు తయారయేది, యిక్కడకు సిగరెట్లన్నీ ఊదేయడానికీ, టానిక్కుల్లో నీళ్ళు కలుపుకు త్రాగటానికీ. సరి గాని ఏమిటో తేల్చు మరి నీ తడాఖా ఎందాకా ఉందో."

చాలా సేపు నిదానించి చూశాను. "ఏముందీ, పైకి, చాలా నీరసించి అతిఖాయిలాగా కనబడుతున్నాడు. వంట్లో సత్తువ లేనందువల్ల మనస్సుకీ రవంత చాంచల్యం ఉండవచ్చును. రాత్రిళ్ళు నిద్రపట్టకపోవడం, ఉదయాది అశక్తత యీ గుణగణాలన్నీ అవలీలగా మనం ఊహించుకోవచ్చును."

"ఇక తమాయించవోయ్, సంతోషించాముగాని తెలివికి" అన్నాడు డాక్-మన

వనన చాలాభాగం విని. "నేను చెప్పనా, ఏమీ జబ్బులేదు" అన్నాడు. ఆ మాటకు నేను నవ్వాను.

"అయితే దున్నపోతులాగా వుండాలిసిందే. యిదంతా నీ మందుల ప్రభావమా ఏమిటి?"

"ముయ్యవోయ్ ఇక అంతటితో: దుక్కలాగా వుంటే ఏమీ జబ్బులేదనీ, చిక్కి శల్యమయితే ఏదో మునిగింవనీ, అవన్నీ నీ మూఢ నమ్మకాలు గాని శాస్త్రం ఒప్పుకోదు. ఈతడికి జబ్బు చేయించకపోతే అసలు కుదర్చడానికి ధన్వంతరి తరమైనా కాదు."

"చిత్రంగా వుంది. కాని నమ్ముతాను: నీవు వైద్యంలో అబద్ధాలు ఆడవని. నాకు ఆ నమ్మకం ఇంకా పోకుండా వుంచి ఎందుచేతనో, ఇంతవరకూ నీతోటివారి నందరినీ చూస్తున్నా."

"షేక్....నీవు మెచ్చి మేకతోలు కప్పితే, ఇప్పుడు మనకు క్రొత్తగా ఒరిగేది లేదుగాని విను."

విరుడు యీ వేసంగిలో ఇతడు భార్యను నాకు చూపించడానికని తీసుకు వచ్చాడు. అప్పటి కప్పుడే ఆమె చాలా వరకు చెదలబట్టిపోయింది. ఒకటేమిటి, స్వరకర్తలందరూ ఝుమ్ అంటున్నారు. లేనిది లేదు.

నేను ఆ రేళ్ళాయె ప్రాక్టీసు మొదలుపెట్టి-అదే చూడటం. అలాటి అనంత గుణ సంపూర్ణురాలిని. ఆరని అగ్నిహోత్రం భాయీ, నిలువెల్లా.

సరే చికిత్సకు ఒప్పుకున్నాను- ఇక్కడే నర్సింగ్‌కు అన్ని వసతులూ వున్నవి గనుక.

ఈతడూ ఇక్కడే పడి వుండేవాడు. ఇంటిదగ్గర ఎవ్వరూ లేరటలే! భోజనం నాతోపాటు హోటలునుంచి తెప్పించే వాడిని. ఆమెకు కావలసిన ధారకం ఏదో తయారుచేసి ఇచ్చేవాళ్ళ మనుకో. ఆ గదిలోకి తొంగి చూడనన్నా చూసేవాడు కాదు. ఇక్కడ వున్న పత్రికలూ, పుస్తకాలూ ఓపిక వున్నంత సేపూ చదువుకోవడం, లేనప్పుడు నిద్రపోవడం, అదీ రానప్పుడు తనలో తాను ఏదో బిగ్గరగా గొణుక్కోవడం.

ఎంత వైద్యుణ్ణయినా నేనూ మనిషినేకదా. నాకూ జాలీ దయా యిలాటివన్నీ అంతో యింతో ఉన్నాయి కదా —పాటివాడు అలా బాధపడుతూంటే.

అవును, అలాగే అనుకున్నాను. ఎంతలా చచ్చిపడి వున్నవాడైనా, ఒకప్పుడు కాకపోతే ఒకప్పు డనిపించదూ. చేసుకున్న పెళ్లామూ అలా అయి....అంత చెడి పోయి....అదంతా చేతకాని తనంవల్ల వచ్చిందనుకున్నా, అనుకోడూ మరి! అనుకుని క్రుంగిపోడూ! అది సహజమే కదా?

అలాటప్పుడు మనమేమీ అవునూ, కాదూ అని, జోక్యం కలిగించుకోకూడదు. మానవ ప్రకృతికి అలవి మీరిన ఉద్రేకం తాండవించేటప్పుడు ఎటు రవంత బెసిగినా మారణమే. దానంతట దానినే తగ్గిపోనియ్యాలి, అది మంచిది."

నేను వింటూ వినిపించుకోకుండా పోనీ పాపం ఏదో మనసులో దుగ్ధకొద్దీ అలా తపిస్తున్నాడు అని నా పని నేను చేసుకుపోతూ అతనితో ఆట్టే అనవసర జోక్యం కలిగించుకోకుండా ఉండేవాడిని. విన్నవే వినడం...ఒకరోజు కాదు, రెండు రోజులు కాదు. రోజూ అదేపాట అయేసరికి తిరుపలేకుని ప్రశ్నించాలిసిన స్థితిలో పడ్డాను. వినగా వినగా సంథ చెప్పుకున్నట్టుగా ఆ కాండ అంతా నోటికి వచ్చేసింది.

"ఈ కేసు ప్రత్యేకం శ్రద్ధతో ఆదినుంచీ గమనించుతూ అన్ని విషయాలు వ్రాసి ఉంచుతున్నాను. ఆ భాగం చదువుతాను వుండు. అది ఆలుమగల సరాగం. నీ వాక్కటి గమనించాలి. కవ్వించి కజ్జాలోకి దింపుతూన్నది మగవాడు: కస్సు మంటూ లేచి కాల్చినట్టుగా వచ్చే జవాబులు యిల్లాలువి."

"నేను ఊరుకోను."

"సరే."

"కనుచీకటి అయినా పడకముందే పట్టపగలే నీవు, అల్లా కలకలలాడుతూ, కులుకుతూ, కిటికీ దగ్గర నిలుచుని ఓరగా కోరచూపులు విసురుతూంటే లోకులు ఏమనుకుంటారు?"

"—ఏమనుకుంటారు? ఆ అమ్మాయి ఎవరో అసాధ్యురాలల్లే ఉంది. కళ్ళతో కనబడి దాటిపోయే ప్రతి మగవాడినీ కబళించి వేదామన్నంత ఆశతో చూస్తూంటుంది అని అనుకుంటారు. అనుభవం వున్నవాళ్ళయితే, జాలిపడతారు."

"అలాగేం-"

"ఊః—పాపం, అవును మరి, అయినో పెళ్ళివాడో లేక ఇంకా అంతకన్నా

అధమస్తుడో అయి వుండాలి; కాకపోతే ఎందుకలా పడుచుది బరి తెగి ఊరిమీద విరుచుకుపడుతుంది? అని జాలిపడరూ."

"పడి—?"

"సడీ చప్పుడు లేకుండా సాగిపోయే సంసారం కాదిది అని, కొంచెం చొరవగా, కదిలించి చూద్దామని ఉబలాట పడతారు."

"మరి ఇక నే నెందుకూ?"

"ఆ సంగతి వాళ్ళకు ఎందుకూ?"

(పైన ప్రశ్నా, జవాబూ సాధారణంగా, రెండు మూడు ఆవృతు లను కుంటాడు. గబగబా కొంత సేపు తరువాత మౌనంగా వుండి క్రమంగా గొణుగుడిలోకి దిగి, అది హెచ్చి మళ్ళా మాటలు ఇవి - మొదటి భాగంకన్న కొంచెం పై స్థాయిలో అంటాడు.)

"నేను ఇక సహించను"

"—మీ ఇష్టము, నేను మీ మాటకు దేనికీ అడ్డు చెప్పను."

"అలా అంటూనే ఇంతదాకా తెచ్చావు."

"మీ రన్నంతదాకా వస్తే ఎంత బావుండును? నాకు తరం కావడంలేదు. మీరు చూస్తూనే వున్నారుకదా?"

"కళ్ళు వున్నందుకు అవును. ఇదీ ఫలం!"

"నాకు అంతకన్న ఎక్కువ ఒరిగిందేమున్నదీ? కాయలు కాచేటట్టుగా చూసి మొగం వాచినా మాత్రం, ఫలించందే! తలవాకిలి ఇల్లుగా వుంటూన్నా దైవానికి దయరాదు."

"నీకు తోడు దైవం కూడాను.!"

"అందుకే, నేను కలవరించేది!"

"ఎవరికోసం?"

"చూడలేదా మీరు? మన వీధి చివర మేడమీద ఇవతలి గదిలో వుంటాడు, చూడండి. ఆ గిరజాల పిల్లవాడు, వంచిన తల ఎత్తకుండా పోతాడు. అదేం పాప మండీ, ఎన్నడన్నా కన్నెత్తి నావంక చూస్తాడేమోనని-కాచుకుని వుంటే-"

"ఇక-నీవు నోరెత్తితే, నీవు-నోరెత్తితే-"

"అవును నోరెత్తినా ఏం ప్రయోజనం? నాతో శ్రుతి కలిపి అంటుకునేవారు లేనప్పుడు. నిజమేలెండి - అయినా, మిమ్మల్ని అనడం ఎందుకు?-"

"అది మాత్రం మిగిలిందా? ఇదంతా ఆ ముచ్చటే కదూ? ఇంతకూ నేను బ్రతకడం నీకు కంటకంగా వుంది. అంతే కాదూ?"

"లేదండీ, ఎంత ఒట్టు వేయమన్నా వేసుకుంటాను. ఎంతో హాయిగా వుంది."

"అవును : అనుకూలంగా—"

"ఏమన్నా అనుకోండి, అదృష్టానికి కర్తలు మీరు. మీ కళ్ళ ఎదుటనే నే నిలా చలా చలావుగా వుండటం-నిజంగా నమ్మండి, నమ్మకపోండి - అప్పుడు కూడా మిమ్మల్నే తలచుకుని అంతా మీ దయే అనుకుంటాను."

"ఇదోయ్ అతడు రోజూ అప్పగించే పాఠం."

"ఇందులో అర్థంకానిది ఏముంది? తేట తెలుగులో మాటూ మర్మమూ లేకుండా ఢంకామీద మ్రోగినట్లుగా నడుస్తూంటే. అతడు అర్భకుడు, ఆ అమ్మాయి పరమ నేను. అందుకనే వెనుకటి సామెతగా చెప్పి చెప్పి మరీ చెప్పినంతా చేసింది. అర్థం పడటానికి ఆ ప్రవాహం ముందర అతడు లెక్కా జమా? ఎంత గ్రంథం జరిగిందో? ఆ భోగట్టా మనకు తెలియకపోయినా, ఆ అమ్మాయిని చూసిన తరువాత ఆ వ్రతం శక్తివంచన లేకుండా పట్టి పల్లార్చిందని స్పష్టమౌతుంటేను!"

"అవునా! యిదంతా అసలు కథకు పూర్వరంగం అనుకో. ఆ పిల్లది సకలాభరణ భూషితురాలై మన దగ్గరకు మరమ్మతుకు వచ్చిందన్నంతవరకే నీవు ప్రస్తుతం గ్రహించవలసింది. అంతకుమించిన అర్థం ఆలోచించావా అంటే ముఖ్య విషయాలు అతకవు.

నీవు అనుకుంటూన్న ధోరణి కాదులే విను.

అప్పటినుంచీ జరిగిన నాటకంలో మనకూ భాగమున్నది. మన సమక్షానే నడచింది గనుక తేదీలవారీగా పుస్తకం తిరగవేయకుండానే ఏనాడేమైందో చెప్ప గలను గాని, అదంతా తడిసి మోపెడవుతుంది. టూకీగా—

మందు మాకులవల్ల మళ్ళా మామూలు మనిషి కావడానికి ఆ అమ్మాయిలో కొన్ని భాగాలు పూర్తిగా దుష్టములై పోయినవి. అందువల్ల కత్తి పట్టవలసి వచ్చింది. ఆపరేషనులో అనేక తికమక లున్నాయి. అంత పని మన ప్రాంతాల్లో, ఎవడికి

చేయడానికి చేతులాడవు. నేనూ మొదట తటపటాయించాను కాని, చివరికి తెగించి ఎలాగైనా మా బాగేకదా అనుకుని చొరవ చేశాను. చేసినందుకు అది నెరవేరింది.

నేనేం అందరికన్నా మహా పొడిచేశాను అని నీ ముందు గొప్ప చెప్పుకోవడం కాదు; ఆ వేళా విశేషం అటువంటిది. అదే ఇంకొకప్పుడైతే ఆ అమ్మాయి కాక యింకొకరైతే నాకూ చేతులు చప్పబడేవేమో! ఏమో యింతకూ ఆమె అదృష్ట వంతురాలు. గడచి బ్రతికింది.

అదిగో, అక్కడే, నేనూ పొరబడినది. అది తెలుసుకునేసరికి నేనూ ఇంకా పెరటిదోవనే వున్నానని లోలో నేను పొగడుకుని ఉబ్బిపోతూన్న నా తెలివితేటలే నెత్తినెక్కి నన్ను వెక్కిరించినవి.

ఏమైందనుకున్నావు! ఆమెకు కొంచెం నిమ్మళించిన తరువాత ఒకనాడు అతనిని పిలువమంది. అంతవరకూ తొంగి చూసి ఊరుకోవడమే కాని ఎన్నడూ లోపలికి అడుగు పెట్టేవాడు కాదని యిందాక చెప్పాను కాదూ.

ఇద్దరూ ఒకరి నొకరు అన్ని రోజులకు అంత దగ్గిరగా అదే చూసుకోవడం. అక్కడ నేనూ వున్నాను. అవతలకు వెళ్ళిపోదామనుకుంటే ఆమె వుంటేకాని వీలు లేదనీ, వున్నందువల్ల ఫరవా ఏమీలేదనీ నిలిపివేసింది.

ఇదోయ్ ఆమె అతన్ని పలుకరించడం "ఇక మీరు ఎలా బ్రతుకుతారండీ."

విని నే నేమనుకోవాలి? మనసు పరిపరివిధా లయిపోయింది. అతడూ తెల్లమొగంవేసి విని, తల వంచుకుని ఊరుకున్నాడు. ఆ అమ్మాయి అంతటితో ఆగలేదు.

"అవునండీ నాకు అదే దిగులుగా వున్నదండీ! నేను బ్రతికాను, బట్ట కడతానన్న మాటేకాని, నేను ఇక వున్నా, లేనిదానిలోనే జత. నా మాట అబద్ధ మనుకుంటే పోనీ డాక్టరు గారిని అడగండి. నేను ఆకారానికే కాని, అంతేనండీ, అయ్యో మీరు?"

అయ్యో పాపం అని అనుకున్నానే కాని, ఆ మాటమీదనుంచి వచ్చిన మామూలు ఆలోచనలో అనుమానం వేసింది. అంత అనురాగము కలదే అయి అతని క్షేమానికి అంత ఆదుర్దాపడే మనిషే అయితే అందాకా రావడం ఎందుకు కలుగు తుంది? లేక యిప్పుడు వస్తూన్న బుద్ధా? అయినా అంత విషమ యాతనకే తట్టుకుని భార్యను ఎన్నడూ పల్లెత్తి ఏమీ అనని ఆ త్యాగమూర్తి ఆమె మళ్ళా తన కళ్ళ

యెదుటే కనబడుతూన్నందుకే యేనుగు నెక్కినంత సంతోషించి ఊరుకుంటాడు గాని ఆమెతో కాపురం కరవైందని ఉరి పెట్టుకునేందుకు దిగేవాడే అయితే యిన్నాళ్ళూ, యింతకు పూర్వం ఆఘోరించిందేమిటి? అలాటి దిమ్మరిని కట్టుకుని....ఉహూ.... ఆ ఊహ సరి అయినది కాదు.

ఆమె యింకా చెపుతూనే వున్నది. అతడలా ఆలకిస్తూనే వున్నాడు.

"నాకు ఇదివరకు ఇంతగా విడమరిచి చెప్పేటంత తెలివి లేకపోయింది. కాని ఇన్నాళ్ళూ ఇదే ఆలోచన ఏమో? ఇప్పటికి తెలిసి వచ్చిందంటీ. నా సంగతీ, మీ సంగతీ, విడియపడకండి. మనం ఏనాడో చేసుకున్న పాపం కాకపోతే అందరిలాగానే మనమూ అమ్మ కడుపున పుట్టామేకాని, హఠాత్తుగా ఎక్కడనుంచో ఊడిపడలేదు కదా? అందరి లాగా బ్రతకలేమని, మన మేమైనా బ్రహ్మతో మొరపెట్టుకున్నామా? అందరిలాగా ఎందుకు లేమూ?"

"అవునండీ....అనుభవించుతూన్నదేనా మనం. ఇప్పుడు కాదంటే ఏమన్నా-పోతుంది గనుకనా? భార్య పరులను ఆశించి భ్రష్టురాలవడం చూస్తూ ఆ బాధ అహర్నిశలూ పడుతూంటేనేగాని, పతివ్రత అయిన పాపానపోతే మీకు బ్రతుకు కర వౌతుంది. అది మీ ప్రకృతి. నేనో మనసులో ఏమీ పాడు కోరికలు లేకపోయినా, శరీరం ఎంత మాత్రమూ నేను చెప్పినమాట వినదు. దానికి విడవకుండా నూతన అనుభవాలు లేనిదే అది నిలువదు. దానిని ఆపడం నా వశంలో లేదు."

"అంతేనండీ—యీ జన్మానికి ఇక మగవానికీ నాకు - జిలాయి! అయినా మొండికిపడి మ్రోడునై ఏదో విధంగా రోజులు వెళ్ళబుచ్చుతాను. కాని బాధపెట్టలేనే? ఏలా బ్రతికించుకుంటానా మిమ్మల్ని అనే అదే దిగులు."

అంటూ ఎంతసేపో విలపించిందోయ్.

అదీ కథ.

"నీవూ బ్లాఖ్, ఎలింగ్ అవన్నీ చదివినవాడవేకదా, ఎల్లిస్‌తోపాటు అందు కున్నావుకాదూ?"

"అందుకు మనం ఏం చేయగలం?"

"అయినా చేయగలిగిందంతా చేశాను; ఆమె ఆ ఆలోచన మానేటట్టు చేయలేక పోయినాను. మనసును—ఏమైతే నేమిలే బ్రతికించలేకపోయినాను; ఆ నిరాశే ఆమెను తినేసింది.

ఆమె పోయింది-నా తెలివి తక్కువవల్లనే అనుకో: అంతకన్న బెడద ఇది; ఈతని సంగతేమిటి? ఎటూ తోచలేదు. తపన ఎత్తి కొట్టుకున్నాను. పుస్తకాలు ఎన్ని సారులు తిరగవేసి చూసినా అందులో ఏమిటి కనబడేది నా మొగం?

మళ్ళా మొదటికి వచ్చాను.

ఎక్కడ బండి త్రోవ తప్పిందో, తెలుసుకోవద్దూ? అన్ని త్రోవలూ వెదకి చూశాను; తోసేశాను.

ప్రకృతికి ఎదురీతగా బ్రతికే తత్త్వం మనసుకూ, దేహానికీ ఒకదాని కొకటి తీసిపోని స్వాతంత్ర్యాన్ని అలవరుస్తుంది. అది నిలవకపోతే అప్పుడా మనిషి గల్లంతు. అంటే ఇంకా విశదంగా చెప్తాను. ఆ అమ్మాయి వున్నదా? ఇంకా పది కాలాలపాటు ఎందుకు వుండలేకపోయింది? ఒళ్ళు చెప్పిన మాట మనసు విన్నది· రెండూ ఏకమై ఎగిరి పోయినవి.

అతివాంఛ - దేహానికి సంబంధించినంతవరకూ ఆ అమ్మాయి ఆరోగ్యానికి కారణం. అది మన చేతి చలువను కట్టుపడిపోయింది. అయినా, బ్రతికేదే; ఎందు చేతనంటే మగడు మామూలువాడైతే, ఆమె కూడా అది జబ్బని అంతకుముందే గ్రహించి వుంటే. అతడు తెలివిలేనివాడైతే తొలి తప్పుకే ఆమెను వదిలివేసి, తన త్రోవ తాను చూచుకుని, సుఖంగా వుండేవాడు. ఆ అమ్మాయికి అలా నిత్య నూతనాన్వేషణం వెగటైతే ఆత్మహత్య చేసుకునేది.

నేను ఒక కేసు చదివాను. ఓ పిల్ల తాను వ్యభిచరించంది ఒక్కక్షణం బ్రతక లేనని తెలుసుకుని అలా చేయడానికి అసహ్యపడి మగనితో ఆ సంగతి చెప్పి తన శీల రక్షణకు చంపేసేయమన్నది. అతడు పాపం ఆ అమ్మాయి అంటే అమితమైన ప్రేమట; అలా చేసేశాడు. అదంతా పెద్ద గొడవై —సరి...అది మనకు అక్కర లేదనుకో. అసలు విషయం...అదీ ఇప్పుడు యీ పిల్లదానికి అన్నీ ఉడిగి ఆలోచనలో పడిన తరువాత తనలా ప్రవర్తించడం తనకు జబ్బు అనే సంగతే విడిచేసి అదే అంత వరకూ తన పసుపూ, కుంకుమా కాపాడుకుంటూ వచ్చింది అని...మగని లోటు పాటేమో తెలుసుకున్నది. అతనిమీద ఎన్నటికీ అసహ్యంకాని, అతనిలో కలియకుండా వుండటంకాని లేదు. అయితే అందువల్లనే అమితమైన జాలి. అతడు బ్రతుక లేడేమోననే బాధ ఆమెను అమాంతం మింగేసింది.

అతని సంగతి ఏమిటి చేయడం? ఎలా కాపాడటం?

కథా నిలయం
68
శ్రీకాకుళం

దైవం ఇచ్చిన శక్తి సామర్థ్యాలకు అతనికి లోటేమీ లేదు. సుష్టుగా సుఖపెట్టి సుఖపడగలడు. అది సరి, అందరికీ పరిపాటి అయిన తాహతు. కాని అతని ప్రకృతి అంతతో శాంతించదు - కావలసిన తృప్తి కనులారా గద్ద తన్నుకుపోతూంటే చూసి బాధపడితేనేగాని.

అది అసలు లేకపోయినా అతనికి అట్టే ఫరవాలేదు కాని. ఇది... ఈ నాటకం లేకపోతే ఎగుడూ దిగుడూ అయిపోతాడు. దీనికి కారణం, అనేక మానసిక రుగ్మతల మహా సమ్మేళనం. డాక్టరు ఫ్రూష్, న్యాస్టరమ్, హక్షిల్ వీళ్ళందరి నిగా లోకి యిలాటి కేసులు ఒకటి రెండు వచ్చినవి....అంతే యింత క్లిష్టమైనవి కావనుకో. ఏదో వాళ్ళ తంటాలు వాళ్ళు పడ్డారు. ఆ గ్రంథాలన్నీ అలుమారలు నిండటమే కాని మనకు ఏమీ యీ విషయంలో వుపయోగించలేదు.

నేను చేసే చికిత్స ఏమిటో లఘువుగా ఆ ధోరణి చెప్తాను. మనసుకు ఆలోచించుకునే శక్తి రావడానికి దాని లక్ష్యం క్రమంగా శరీరము మీదికి త్రిప్పి నిలుపుతున్నాను. మనసుకు అంటేటట్టుగా శరీరాన్ని బాధలోకి దింపుతున్నాను. అసలు ఆరోగ్యం చెడనీయకుండా జబ్బు చేయిస్తూన్నాను. కొంతకాలానికి, ఎంతకాలమైనా కానీ అతని మనసులో తనకోసం నిరంతరం తాపత్రయమేకాని వేరు ఆలోచన వుండదు. ఎందుచేతనంటే నిస్పందస్థితిలో, వెనుకటి అనుభవములో పాదుకుపోయిన మనసు క్రమంగా ఈ ఆలోచనలోకే మేలు కుంటుంది, గనుక ఆ మెట్టు ఒక్కటీ ఎక్కి, అక్కడ పట్టుచిక్కితే తరువాత అతనిని బాగుచేయడానికి మూడు నిమిషాలు పట్టదు. అప్పుడు మనం మీసంమీద చేయి నిర్భయంగా వేయవచ్చును."

డాక్టరు ప్రసంగం చాలించి, ఉద్రేకంలో మీసం మీదకు పోయిన చేయి అలాగే నిలిపి నా ముఖంమీద నవ్వాడు.

నేను చుట్టూ, మా కాళ్ళకు యివతలా అవతలా చెల్లాచెదరుగా పడివున్న సిగరెట్ పీకెలూ, కొడీ వాటిమీదనే చూపు నిలిపి "ఏమిటో అర్థం అయిందనుకో. కాని అంతా అయోమయంగా వుంది." అన్నాను.

"తర్క-పాదం తప్పింది సోదరా! అర్థం అయితే ఇంకా అయోమయం ఏమిటి? ఇందులో మళ్ళా నిక్కా-? మాకు అర్థం అయి అఘోరించింది గనుక నీకు కాలేదనా? మనసోయి మరేమనుకున్నావు దాని మజా....హు" అంటూ అనంతమైన బడలికతో ఆవులించాడు. నేను సిగరెట్టుకు ఇంకో సిగరెట్ ముట్టించాను.